

హైదరాబాద్ వార్త

# సైబర్ నేరగాళ్ల వికృత చేష్టలు

-ఎఐతో ఏమరుపాటు చర్యలు
-భవిష్యత్తులో కోట్లు కొట్టేయనున్నట్లు సైబర్ క్రైం పోలీసుల భోగట్టా
-భర్త ఏడుపు వినిపించి గృహిణి వద్ద దోపిడీ యత్నం
-ఒక వృద్ధుడికి 24 గంటల పాటు వీడియోకాల్ వేధింపులు
-తిండి, నిద్ర, స్నానాలకు కూడా కదలనివ్వలేదు



**హైదరాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ళు డబ్బు కోసం మరింత నీచానికి దిగజారుతున్నారు. ఏఐ సాంకేతికతని వాడుకుని సామాన్యుల ఏడుపు వినిపించి, వారి కుటుంబీకుల నుంచి డబ్బు కాజేసే యత్నం చేశారు. అంతే కాకుండా టెక్నాలజీ పైన పెద్దగా అవగాహన లేని విశ్రాంత ఉద్యోగులను టార్గెట్ చేసి లక్షలు దోపిడీ చేస్తున్నారు. మరోపక్క నకిలీ కస్టమర్ కేర్ నెంబర్ల ద్వారా తమకు వచ్చిన ఫోన్లలో అమాయక ప్రజల బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్నారు. నగరానికి చెందిన గృహిణి(58) ఒకరు ఏసీ పనిచేయట్లేదని గూగుల్‌లో వెతికి, శామ్‌సంగ్ కస్టమర్ కేర్‌కి ఫోన్ చేయగా లైన్‌లోకి వచ్చిన నకిలీ నిపుణుడు ఒక లింకు ద్వారా బాధితురాలి ఖాతా నుంచి, ఆమె తల్లి ఖాతా నుంచి కూడా లక్షల్లో ఉన్న మొత్తం డబ్బుని నిర్లక్ష్యంగా దోచేశాడు. నగర పరిధిలో ఇటువంటి వరుస సైబర్ క్రైమ్‌లకు తెగబడుతున్న సాంకేతిక దొంగలు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి తగ్గట్టుగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఉపయోగించి సైబర్ నేరాలకు కొత్త వ్యూహాలు రచిస్తున్నారు. భవిష్యత్తులో ఏఐ ద్వారా కోట్లు కొల్లగొట్టనున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు సాంకేతిక చోరీలను అరికట్టడానికి 24 గంటల గోల్డెన్ అవర్ దాటకుండా ఫిర్యాదు చేయమని చెబుతూనే, ప్రతి బుధవారం నగరంలోని వివిధ సైబర్ నేరాల పట్ల విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు.

**ఏఐ వాడుతున్న సైబర్ దొంగలు:**

ఇటీవలే నగరానికి చెందిన ఒక గృహిణికి నకిలీ పోలీసుల నుంచి సీబీఐ పేరుతో వీడియోకాల్ వచ్చింది. మాదకద్రవ్యాలు, మనీ ల్యాండరింగ్ కేసులో ఆమె భర్తను, కుమారుడినీ అరెస్ట్ చేశామనీ, వారిని కేసునుంచి బయట పడేయాలంటే రూ.50 వేలు తమ ఖాతాకు బదిలీ చేయమని ఆదేశించారు. వీడియో కాల్‌లో ఉన్న ఇద్దరు పోలీసులు పక్కకు వెళ్ళి ఎవరినో లాఠీలతో చితకబాదగా, బాధితురాలికి తన భర్త, కుమారుడి ఆర్తనాధాలు వినిపించాయి. దాంతో ఆమె భయంతో వణికిపోయింది తప్ప అవి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా రూపొందించిన ఆర్తనాధాలని గ్రహించలేకపోయింది. కానీ తొందర పడకుండా, ఆ నకిలీ వీడియోకాల్‌ను కట్ చేసింది. వెంటనే ఆమె భర్తకు ఫోన్ చేయగా అతడి స్వరం విని జరిగిందంతా పక్కా ఫ్రాడ్ అని గుర్తించింది. తన భర్త ఇంటికి రావడంతో జరిగిన వషయాన్ని వివరించి ఊపిరి పీల్చుకుంది. దాంతో అప్రమత్తమైన ఆ కుటుంబం సైబరాబాద్ ఠానాలోని ఫిర్యాదు చేశారు.

**వృద్ధుడని కూడ చూడకుండా వేధించారు:**

తాము దోపిడీ చేస్తున్న బాధితుడు ఒక వృద్ధుడని కూడా చూడకుండా 24 గంటల పాటు వీడియో కాల్ ముందే ఉంచి మోసానికి ఒడిగట్టారు సైబర్ దొంగలు. కనీసం తిండి తినడానికి, స్నానానికి, నిద్రపోవడానికి కూడా వదలకుండా భోగస్ బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, నగరానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి(78) ట్రాయ్ పేరుతో ఒకసారి, ముంబై క్రైమ్ బ్రాంచ్ పేరుతో మరోసారి వాట్సాప్ వీడియో కాల్ చేశారు. డ్రగ్స్ కేసులో అతడిని అరెస్ట్ చేయనున్నట్లు తెలిపారు. తాను ఎటువంటి నేరాలకూ పాల్పడలేదని, ఆర్‌బీఐ ద్వారా తన బ్యాంక్ ఖాతాలను తనిఖీ చేసుకోమని బాధితుడు ప్రాధేయపడ్డాడు. నిందితులు డబ్బు డిపాజిట్ల వివరాలను అడగగా, ఆ రోజు ప్రభుత్వ బ్యాంకుల సెలవు దినమవ్వడంతో 24 గంటలు ఆగవలసి ఉంటుందని చెప్పాడు. దాంతో ఆ వృద్ధుడిని బయటికి వెళ్ళనివ్వకుండా అతడి కదలికలు గమనించడానికి నేరుగా ఇంటికి పోలీసుని పంపి స్వామని మరింత భయపెట్టారు. మర్నాడు పని గంటలు మొదలయ్యే వరకూ వాట్సాప్ వీడియో కాల్ నుంచి కదలకూడదంటూ తిండి తినడానికి, మాత్రలు వేసుకోవడానికి, స్నానానికి, నిద్ర పోవడానికి కూడా అడ్డు చెప్పి హింసించారు. ఈ వేధింపులు తాళలేని స్థితిలో వృద్ధుడిని రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. దాంతో ఆలోచనా శక్తిని కోల్పోయిన బాధితుడు, అతడి నమ్మకస్తుల వద్ద నుంచి విడతల వారీగా అప్పు చేసి నిందితులకు పంపించాడు. తక్షణమే తమ ఫోన్, మెసేజిల దాఖలాలే బాదితుడి వద్ద లేకుండా చెరిపేసి మాయమయ్యారు కేటుగాళ్ళు. దాంతో అప్పు ఇచ్చిన స్నేహితుల అండతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుల ఖాతాకు నగదు బదిలీ అవ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

**అవగాహనతోనే అరికట్టగలం:**

అంతర్జాల మోసాలను అవగాహనతోనే అరికట్టగలమని నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు ప్రత్యామ్నాయ మార్గాలున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 24 గంటలు గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే పోయిన డబ్బు రాబట్టే ప్రక్రియ ఒకటైతే, ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు రెండో మార్గమన్నారు. డార్క్ వెబ్ ద్వారా ప్రజల ఫోన్ నెంబర్లతో పాటు వారి వ్యక్తిగత ప్రూఫ్‌లు పొందిన సైబర్ దొంగలు యాదృచ్ఛికంగా చేసే ఫోన్‌లలో అధికంగా రిటైర్డ్ ఉద్యోగులు బాధింపబడ్డారన్నారు. వృద్ధులు సాంకేతిక మోసాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నెలలో ప్రతి బుధవారం వివిధ ప్రాంతాలలో పోలీసు బృందాలతో సైబర్ నేరాల అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ, అందులో భాగంగా ఎఫ్ఎమ్ రేడియో, సినిమా థియేటర్‌ల లో ప్రకటనలు తదితర ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. థియేటర్లలో తప్పనిసరిగా సాంకేతిక దొంగతనాల అవగాహనా ప్రకటనలు వేసేలా ఉత్తరువులు ఇచ్చారు. అంతే కాకుండా ప్రముఖ నటులతో సైబర్ క్రైమ్ ప్రకటనలు రూపొందించేందుకు ఒప్పందాలు జరుగుతున్నట్లు తెలిపారు.





# గాంధీ ఆసుపత్రిలో వృద్ధులకు ప్రత్యేక వార్డులు

-జేరియాట్రిక్ వార్డులలో ప్రత్యేక ఏర్పాట్లు -3 దశాబ్దాల ఆలోచనకు కార్యారూపం

**సికింద్రాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో తమను తాము మరిచిపోయిన ప్రత్యేక పరిస్థితిలో ఉన్న వృద్ధుల కోసం జిరియాట్రిక్ వార్డును ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. 1995లో వైద్యులకు కలిగిన ఆలోచన జిరియాట్రిక్ వార్డు దాదాపు 3 దశాబ్దాల తరువాత అంకురార్పణ జరుగుతోంది. ఇందుకు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి వైధికవుతోంది. గాంధీ ఆసుపత్రి ఇన్ పేషెంట్ విభాగంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఖాళీగా ఉన్న వార్డులలో పురుషులు, మహిళా వృద్ధులకు 20 పడకల చొప్పున వార్డులను సిద్ధం చేస్తున్నారు. వృద్ధుల కు బెడ్‌సోర్స్ రాకుండా ప్రత్యేక పరుపులు, మా నసిక, శారీక వ్యాయాయంలో సహకరించేందుకు నిపుణులైన ఫిజియోథెరపీ శిక్షకులను ఏర్పాటు చేయనున్నారు. అంతే కాకుండా వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేకమైన ఫ్లోర్ టైల్స్, బాత్‌రూమ్‌లు, వార్డులలో సపోర్ట్‌తో నడించేందుకు రెయిలింగ్, మానసికోల్లాసానికి వార్డులలో మేమున్నామని ధైర్యం చెబుతున్నట్లుగా డాక్టర్‌లు, పేషెంట్‌లతో కూడి, మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే పెయింటింగ్‌తో ఎంతో అందంగా ఉండే పెయింటింగ్స్ వేశారు. అయితే ఈ వార్డులలో న్యూరో సంబంధ సమస్యలు, ఎవరిని గుర్తుపట్టలేకపోవడం, మతిమరుపు, పార్కిన్‌సోనిజిమ్, శారీరకంగా, మనసికంగా తీవ్ర వత్తిడికి లోనైన ప్రత్యేకతలు గల వారిని మాత్రమే ఇందులో చేర్చుకుంటారు. ప్రత్యేకమైన పరిస్థితిలో వీరికి వైద్య సేవలు అందిస్తారు. జనరల్ మెడిసిన్‌కు వార్డుకు అనుసంధానంగా ఉండే జిరియాట్రిక్ వార్డులో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇద్దరు సీనియర్ రెసిడెంట్‌లు, జూనియర్ వైద్యులు ఇతర నర్సింగ్ సిబ్బంది వార్డులలో వైద్య సేవలందిస్తారు.



# గోల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది సేవలు భేష్

-200పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు పంపండి
-అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం



ఆసుపత్రిలోని ఐసియూని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** గోల్కొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని 200 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని గోల్కొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి ఆసుపత్రిలోని ,డెంటల్ ట్రీట్‌మెంట్ వార్డ్, ఐసియూ ,డయాలసిస్ సెంటర్, ఫార్మసీ స్టోర్, ఔట్‌పేషెంట్ వార్డ్‌లను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న సేవలగురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి వైద్యులు సిబ్బంది చాలా బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇకముందు కూడా రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వందపడకలుగా ఉన్న ఆస్పత్రిని 200పడక ఆస్పత్రికి అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. అనంతరం గోల్కొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల,ప్రభుత్వ బాలుర పాఠశాలను ఎమ్మెల్యేతో కలిసి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉండటం గమనించి, పాఠశాలలు ప్రారంభమైన 15రోజులు గడుస్తున్నా ఇంకా పూర్థిస్థాయిలో విద్యార్థులు హాజరుకాకపోవడం ఏంటని ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించారు. పాఠశాలకు వందదశాతం విద్యార్థులు హాజరయ్యేలా వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశీలించి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడలని విద్యార్థులు నోట్‌బుక్స్ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించినందున పాఠశాలల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో డిసిహెచ్ఎస్ సునీత, గొల్కొండ ఆసుపత్రి సూపరిడెంట్ మహ్మద్ మజారుద్దీన్, కార్పొరేటర్లు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారుల పాత్ర కీలకం : ప్రొఫెసర్ కోదండరాం

**నాంపల్లి, జూన్ 28 ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, వారి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారుల పాత్ర కీలకమైనదన్న ప్రొఫెసర్ కోదండరాం, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానన్నారు. తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో సంఘం అధ్యక్షుడు రవి కిరణ్ సభాధ్యక్షతన జరిగిన సంఘ రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్యఅతిథిగా కోదండరాం, ప్రత్యేక అతిథులుగా సంఘ ప్రధాన కార్యదర్శి వై.శివసాయి కృష్ణ, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్నగౌడ్‌లు పాల్గొని ప్రసంగించారు. గత పదేళ్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం నర్సింగ్ అధికారుల సమస్యలపట్ల ఉదాసీనత, ఉద్యోగుల బదిలీలలో స్థానికతను పాటించలేదని, డీఎ, పీఆర్సీ పెంపును పట్టించుకోలేదని, ఆస్పత్రులలో నర్సింగ్ ఉద్యోగులకు దుస్తులు మార్చుకునే గది, త్రాగునీరు, వాష్‌రూమ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని కోదండరాం ఆరోపించారు. జీఓ 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు న్యాయం, జాతీయ వైద్యమండలి నిబంధనల మేరకు ప్రతీ వందపడకల ఆస్పత్రులో 5మంది హెడ్‌నర్సుల నియామకం విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని కోదండరాం భరోసానిచ్చారు. వై.నాగన్నగౌడ్ అవసరమైన వైద్యసేవలను అందించే ఆరోగ్య సంరక్షణ అధికారుల శ్రేయస్సు కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 7వేలమంది నర్సింగ్ అధికారులను నియమించినట్లు గుర్తుచేశారు. నర్సింగ్ అధికారుల సమస్యలపై వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనరసింహను కలిసి పరిష్కరిస్తానని చెప్పారు. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.కవిత, ఉపాధ్యక్షుడు ఎస్.సుజీవన్, స్వాతి, కార్యనిర్వాహక కార్యదర్శులు జి.నరేంద్రరాజన్, కె.వినోద్, కోశాధికారి జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు. చివరిగా తెలంగాణ నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఈ సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది.



సదస్సులో ప్రసంగిస్తున్న కోదండరాం, రవికిరణ్, శివసాయికృష్ణ, నరేష్ తదితర అతిథులు

## పది నిమిషాల్లోనే రూ.18లక్షలు రికవరీ

-సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ రికార్డు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** సైబర్ నేరంలో దొంగిలించబడిన డబ్బును బాధితుడు ఫిర్యాదు చేసిన పది నిమిషాల్లోనే ఒక సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ రికవర్ చేశారు. వివరాల్లోకి వెళ్తే, అంబర్‌పేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి(31) గుర్తు తెలియని వ్యక్తి నుంచి నకిలీ కొరియర్ ఏజెన్సీ పేరుతో ఫోన్ కాల్ వచ్చింది. అతడి ఆధార్ కార్డ్ ఉపయోగించి ఇరాన్‌కు మాదక ద్రవ్యాల రవాణా జరుగుతోందని., బాధితుడి వివరాలు వెరిఫై చేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ విభాగానికి డబ్బు పంపమని సైబర్ నేరగాడు ఒత్తిడి చేయసాగాడు. తన వద్ద డబ్బు లేదని చెప్పగా, తాను చెప్పే ప్రైవేటు బ్యాంకు ద్వారా పర్సనల్ లోన్ తీసుకోమని, వెరిఫికేషన్ అనంతరం ఆ డబ్బు తిరిగి పంపించేస్తామని నమ్మబలికాడు. దాంతో బాధితుడు వారు చెప్పినట్లే చేసి, తాను మోసపోయి రూ.18లక్షలు పోగొట్టుకున్నట్లు ఆలస్యంగా గ్రహించాడు. వెంటనే నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు హుటాహుటీన వచ్చిన బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఇచ్చిన మరుక్షణమే, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌పై పని చేసే డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఎన్.శ్రీకాంత్ నాయక్ రంగంలోకి దిగాడు. తక్షణమే ఆ పోర్టల్‌లో బాధితుడి వివరాలుతో పాటు జరిగిన సైబర్ నేరంపై ఫిర్యాదు వివరాలు నమోదు చేశాడు. అనంతరం బాధితుడి ఖాతా ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు అధికారులకూ సమాచారం అందించాడు. ఈ రెండు చర్యల వల్లా బాధితుడి డబ్బు సైబర్ దొంగ ఖాతాలోకి వెళ్ళకుండా విజయవంతంగా నిలిచిపోయింది. ఇదంతా పదే నిమిషాల్లో జరగడంతో సైబర్ క్రైమ్ డిప్యూటీ కమీషనర్ డి.కవిత, కానిస్టేబుల్ శ్రీకాంత్ నాయక్‌ను అభినందించారు. అతడి పనితనానికి ఉన్నత పోలీసు అధికారులు కొనియాడారు. సైబర్ క్రైమ్ జరిగిన తక్షణమే 1 9 3 0కి ఫోన్ చేస్తే, బాధితులు స్టేషన్‌కు వచ్చేలోగా తమ డబ్బు రకవరీ చేసే చర్యలు మొదలవుతాయని, డబ్బు రికవరీ మరింత తొందరగా జరుగుతుందని సైబర్ పోలీస్ సిబ్బంది పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కారించాలని ఎమ్మెల్యే మర్రి మౌన నిరసన



మౌన దీక్షలో ఎమ్మెల్యే

**అల్వాల్, జూన్ 28 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు బాదాకరంగా ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఓల్డ్‌అల్వాల్ చౌరస్తాలో మౌన నిరసన చేపట్టారు. ఇందిరాగాంధీ చౌరస్తాను వెడల్పు చేయాలని పలు దఫాలుగా ఎమ్మెల్యేగా వినతులు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. ఉదయం సాయంత్రం వేళలలో చౌరస్తా వద్ద తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయని వివరించారు. ప్రజలు కోసం మాత్రమే తన తపన అని తెలిపారు. చౌరస్తా వెడల్పుకు అధికారికంగా అన్ని అనుమతులు ఉన్నా పట్టింపు లేని ధోరణి కారణంగానే తాను నిరసనకు దిగినట్లు చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులుతో ఆయన చర్చించారు. ముందుగా రోడ్డు ఆక్రమణలను తొలగించి వెడల్పు పనులు చేపట్టాలని కోరారు. అల్వాల్‌లో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. చిన్నన్న తోట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో అన్ని కార్యాలయాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, విఎన్ రాజు, పరమేష్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

## పివి ఆర్థిక సంస్కరణల వల్లే అభివృద్ధిలో భారత్

-మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని



పీ.వీ.ఘాట్‌లో నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

**హైదరాబాద్ జూన్ 28,ప్రభాతవార్త :** మాజీ ప్రధాన మంత్రి,భారత రత్న దివంగత పీ.వీ.నర్సింహారావు తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణల ఫలితంగానే భారత దేశ అభివృద్ధి సాధ్యమైందని మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శుక్రవారం పీ.వీ.నర్సింహారావు 103 జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీ.వీ.ఘాట్‌లో తలసాని నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఆర్ధిక విధానాల రూపశిల్పి,బహుభాషా కోవిదుడిగా పేరు గాంచిన పీ.వీ. నర్సింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకు రావడంతోనే భారత దేశానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని,ఆ ఘనత పీ.వీ.కే దక్కుతుందన్నారు.దేశ ప్రధానికిగా ఆయన ఎనలేని సేవలు చేసారన్నారు.పీ.వీ.నర్సింహారావుకు భారత రత్న ఇవ్వాలని,ఆయన శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది కే సీ ఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు.భవిష్యత్ తరాలకు పీ.వీ. చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందని అవసరం ఉందన్నారు.ఆయనకు భారత రత్న పురస్కారం అందించడం మనందరికి ఎంతో గర్వ కారణమన్నారు.తలసాని వెంట బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి,బీఆర్ఎస్ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్,ఆకుల హరికృష్ణ,నాయకులు శ్రీహరి,ఆరీఫ్,శేఖర్,లక్ష్మీపతి,అరుణ్ గౌడ్, అబ్బాస్,నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్ కాబోతున్న 84 మంది పోలీసులకు సత్కారం

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** పదవీ విరమణ చేయనున్న 84 మంది పోలీసు అధికారులను విధి నిర్వహణలోని వారి సేవలకు గానూ ఘనంగా సత్కరించనున్నట్లు నగర పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సదరు పోలీసులను కుటుంబంతో సహా బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగే సత్కార కార్యక్రమానికి విచ్చేయమని ఆహ్వానించారు. ఈరోజు మధ్యాహ్నం కార్యక్రమం జరిగే సభామందిరానికి వారందరికీ మార్గదర్శకత్వం చేసేలా సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సత్కార కార్యక్రమంలో భాగంగా పోలీసులందరికీ తగిన పదవీ విరమణ ప్రయోజనాలను ఆర్థిక విభాగ అధికారి వెల్లడిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

## షాద్‌నగర్‌లో వషాధం

-గాజు పరిశ్రమలో భారీ పేలుడు
-ఆరుగురు మృతి

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** షాద్‌నగర్ ప్రాంతంలో పెను విషాదం చోటు చేసుకుంది. స్థానిక సౌత్ గ్లాస్ పరిశ్రమలో కంప్రెషర్ పేలడంతో 15 మందికి గాయాలు కాగా, ఆరుగురు మృతి చెందారు. ఒకేసారి కంప్రెషర్ పేలడం, అందులోనూ గాజు పరిశ్రమ కావడంతో కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బందీ మంటలను అదుపు చేస్తూ, సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. మృతులు ఒడిశ్శా, బీహార్, యుపీ ప్రాంతాలకు చెందినవారిగా గుర్తించారు. గాయాలు పాలైన కార్మికులను స్థానిక ఆసుపత్రికి తరలించగా వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో తీవ్ర గాయాలయిన వారిని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు తరలించనున్నారు. ఈ దుర్ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి, భారాస కార్యనిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేసేలా, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించేలా కలెక్టర్‌ను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## ఉద్యోగం లేదని యువకుడి ఆత్మహత్య

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** ఉద్యోగం లేదనే మనస్థాపంతో ఒక యువకుడు విషం సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలానికి చెందిన బి.అనోక కుమారుడు బూర్జ వెంకటరాముడు 21 ఉద్యోగ రీత్యా హైదారాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. రామంతాపూర్‌లోని తన బంధువు సాయికిరణ్ ఇంటికి వచ్చి ఈనెల 13వ తేదిన తన తండ్రికి ఫోన్ చేసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో బందువుల గమనించి అతనిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు మస్కా

-బ్రీత్ ఎతలైజర్‌తో పరారీ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** డ్రంక్ ఎండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు తాగి ఉన్న ఒక వ్యక్తి మస్కా కొట్టి బ్రీత్ ఎనలైజర్‌తో పరారయిన ఘటన బొయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే గురువారం రాత్రి నగరంలో ఎప్పట్లాగే పోలీసులు డ్రంక్ ఎండ్ డ్రైవ్ టెస్టులను పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ క్రమంలో బొయినల్లిలో ఓ మందుబాబు హుషారుతనం చూపించాడు. డ్రంక్ ఎండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తూ సదరు వ్యక్తి నోట్లో పోలీసులు బ్రీత్ ఎనలైజర్ పెట్టిన మరుక్షణమే, రెప్పపాటులో అక్కడి నుంచి ఉడాయించాడు. డ్రంక్ ఆల్కాహాల్ టెస్టింగ్ మిషన్‌తో పారిపోవడంతో ఒక్కసారిగా ఖంగు తిన్న ట్రాఫిక్ పోలీసులు, అతడిని చేజ్ చేసినా లాభం లేకపోవడంతో స్థానిక బోయినపల్లి పోలీసులకు సమాచారమందించారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమేరాల ద్వారా నిందితుడినీ, వాహనాన్ని ట్రాక్ చేస్తున్నారు.

## వీధి కుక్కల బెడదను తప్పించాలి : మహేందర్‌గౌడ్



బండ్లగూడలో వీధి కుక్కలను బ్లూక్రాస్ సొసైటీ ప్రతినిదులకు పట్టిస్తున్న మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్.

**నార్సింగి, జూన్ 28 ప్రభాతవార్త :**
బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను తప్పించాలని మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. కార్పోరేషన్ పరిధిలోని డిడి కాలనీ, ఆదర్శ నగర్, వినాయక్‌నగర్, గాయత్రీ నగర్ కాలనీల లో విచ్చల విడిగా వీధి కుక్కలు సంచరిస్తున్నాయని, పలువు రిపై దాడి చేసి కరిచాయని స్థానికులు మహేందర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి బ్లూక్రాస్ సొసైటీ ప్రతినిధులకు ఈ సమాచారం అందించి వీధి కుక్కలను దగ్గరుండి పట్టించారు. గతంలో వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించామని తెలిపారు. నగరంలోని కుక్కలను నగర శివారుల్లోకి తీసుకొచ్చి వదులుతుండడం వలన బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలో వాటి సంఖ్య గణనీయంగా పెరిగి పోయిందన్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, పనులపై బయటకు వెళ్లే మహిళలనే ఈ విధి కుక్కలు టార్గెట్ చేసుకొని దాడులు చేస్తున్నాయన్నారు. ప్రజలు ఈ వీధి కుక్కల బారిన పడి మరణించకముందే కార్పోరేషన్ అధికారులు కళ్లు తెరువాలని, వీటి సంఖ్యను నియంత్రించే పనులు చేపట్టాలని మహేందర్‌గౌడ్ సూచించారు. మహేందర్‌గౌడ్ స్పందన పట్ల కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

**నార్సింగి, జూన్ 28 ప్రభాతవార్త :**
మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఓపెన్ టెక్స్ట్ కంపనీ ప్రతినిధులు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కంపనీ ఎండి సంగీత, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ సర్కారు బడుల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద బిడ్డలే చదువుతున్నారని, వారికి ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. సర్కారు సహకారంతో పాటు దాతలు, స్వచ్చంద సంస్థలు ముందుకు వచ్చి సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. నోటు పుస్తకాలు, బ్యాగులు, కంపాస్‌లు, పరీక్షా ప్యాడ్‌లు ఇలా అన్ని రకాలుగా సహకారం అందిస్తే చదువుల్లో ఉత్తమంగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాంగ్య నాయక్, నాయకులు గంగాధర్, ఏర్పుల కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్తు వ్యవస్థ ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు



విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 28 ప్రభాతవార్త:**
గాంధీనగర్ డివిజన్‌లో విద్యుత్తు వ్యవస్థను ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని సబర్మతి నగర్‌లో పాత విద్యుత్తు స్తంభంకు షార్ట్‌సర్క్యూట్ రావడంతో బస్తీవాసులు ఆందోళనకు గురైన విషయాన్ని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే సిబ్బంది వచ్చి యుద్ధప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించారు. కొత్తగా విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం కార్పొరేటర్ సూచనల మేరకు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేశ్, నాయకులు కుమార్, ఆనందరావు, బస్తీవాసులు నర్సింగ్‌రావు, యాదగిరి, లక్ష్మణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

**బోనాల నిధుల కోసం దరఖాస్తులు చేసుకోవాలి : ఎమ్మెల్యే**

**చిక్కడపల్లి, జూన్ 28 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గంలో బోనాలు నిధుల కోసం అమ్మవారి మండపాల నిర్వాహకులు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు ముఠాగోపాల్ కోరారు. ఈ మేరకు అన్ని డివిజన్‌లకు చెందిన అమ్మవారు మంటపాల నిర్వాహకులు వెంటనే సరైన పత్రాలను అందించాల్సి ఉంటుందన్నారు. డివిజన్‌లలో బోనాల ఉత్సవాలకు సంబంధించి గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోగాని, కాచిగూడలోని తుల్జాభవన్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిసెంట్ కమిషనర్ కార్యాలయంలో అందించవచ్చన్నారు. ఇతర వివరాలకు 9392222117 (ముచ్చుకుర్తి ప్రభాకర్)ను సంప్రదించవచ్చని, ఆషా బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, త్వరలోనే సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు.

**కార్యకర్త కొండయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు**

**యూసుఫ్‌గూడ, జూన్ 28, ప్రభాతవార్త :**
బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళల కార్యకర్తలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న కొండయ్యను ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించారు.రాజీవ్‌గాంధీనగర్ ఏ బ్లాక్ అధ్యక్షులు బీఆర్ఎస్ కార్యకర్త రమేష్ తండ్రి కొండయ్య ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం తగిన విధంగా వైద్యులతో మాట్లాడి మరింత మెరుగైన వైద్యం అందేలా చేస్తామన్నారు.

## జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలిని కలిసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా నియమితులైన అమ్రపాలిను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త**
జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా నియమితులైన అమ్రపాలిని శుక్రవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిషనర్‌కు పుష్పగుచ్చాన్ని అందించి అభినందించారు.అంబర్‌పేట నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపడుతున్న పనులు, మంజూరు చేయాల్సిన పనులపై ఈ సందర్భంగా కమిషనర్‌తో ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్‌ను కలిసినవారిలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డిలు ఉన్నారు.

# వైభవంగా బుజిలి మహంకాళీ ఆలయ వార్షికోత్సవం

**నార్సింగి, జూన్ 28 ప్రభాతవార్త :**
బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన "శ్రీ మహాకాళేశ్వర సమేత బుజిలి మహంకాళీ దేవాలయ" ప్రథమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వనుల మధ్య శ్రీశ్రీశ్రీ జగద్గురువు ఆది శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతీ స్వామీజీ చేతులపై వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. వందలాది మంది భక్తజనం అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తున్న అమ్మవారి దర్శనం కోసం భక్తజనం పోటెత్తింది. బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ దంపతులు అమ్మవారి క్రతువులు జరిపించారు. ఈ సందర్భంగా విద్యారణ్య భారతి స్వామి మాట్లాడుతూ దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని తెలిపారు. విశ్వంలోని శక్తిని ఆలయ శిఖరం, ధ్వజ స్థంభాలు లాక్కొని ఆలయానికి వచ్చే భక్తులలోకి ప్రసరిపంచేస్తాయన్నారు. ఫలితంగా మనలోని ఆందోళన, భయం, ఆవేదన తగ్గి ప్రశాంతత పెరుగుతుందన్నారు. నిత్యం దేవాలయానికి ఎవరు వెళ్తారో వారికి ఆయువు, ఆరోగ్యం పెరుగతుందన్నారు.



బండ్లగూడలోని బుజిలి మహంకాళీ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు జరుపుతున్న విద్యారణ్య భారతి స్వామీజీ దృశ్యం

పెద్దలంతా విధిగా ఆలయాలకు వెళ్లాలని, వెంట వాంసులను తీసుకెళ్లి మన సంస్కృతి, సాంప్రదాయలు ఒంట బట్టించాలన్నారు. ఈ ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైన, శుద్ధమైన, సనాతన ధర్మం మనదేనని తెలిపారు. ఎవరైనా మనసా, వాచా, కర్మణా సనాతన ధర్మంను ఆచరిస్తారో వారు చేసే ప్రతీ కార్యంలో విజయం పొందుతారని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, పుర ప్రముఖులు, పాల్గొన్నారు.

# కార్వాన్‌లో జిల్లా కలెక్టర్ పర్యటన

**మెహిదీపట్నం, జూన్ 28, ప్రభాతవార్త :**
బాల,బాలికలకు నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి అన్నారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులన్నారు. శుక్రవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌తో కలిసి కలెక్టర్ కార్వాన్‌లో కార్వాన్‌లోని పన్నిపుర ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, గోల్కొండ ఏరియా ఆసుపత్రిలతో పాటు గోల్కొండ ప్రభుత్వ బాల, బాలికల పాఠశాలలను పరిశీలించారు. కార్వాన్‌లో పన్నిపుర ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 200ల పడకలను, ఐసీయూతో కూడిన 10 పడకలను, 10 డయాల్సిస్ యూనిట్‌తో పాటు ఆక్సీజన్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ తగు చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ..కార్వాన్ అభివృద్దే లక్ష్యంగా ముందుకు



గోల్కొండ ప్రభుత్వ బాలికల పాఠశాలలోని విద్యార్థినీలతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్.

వెల్లడం జరుగుతుందని, కోట్లాది నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చెస్తున్నాని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో, ఆసుపత్రులలో అన్ని సదుపాయాలతో పాటు అవసరం మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీరి వెంట స్థానిక కార్పొరేట్లు మహ్మద్ నసీరుద్దీన్, వజీ ఉజ్జమా సిద్దికి, అధికారులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్టీఏ అధికారిపై దాడిని ఖండించిన కెకెసి నాయకులు

**సైఫాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:**
ఖైరతాబాద్‌లోని ఆర్‌టిఎ కార్యాలయంలో రవాణ శాఖ హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్‌పై జరిగిన దాడిని అఖిల భారత అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) తీవ్రంగా ఖండించింది. బాధ్యతయుతమైన ఒక యూనియన్‌కు అధ్యక్షుడిగా ఉన్న అమానుల్లాఖాన్ గురువారం ఒక అధికారిపై దాడికి పాల్పడటం చట్టరిత్య నేరమని, తక్షణమే కమిషనర్‌కు క్షమాపణ చెప్పాలని కెకెసి డిమాండ్ చేసింది. శుక్రవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెకెసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్‌రెడ్డి, ఆటో విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ మాట్లాడుతూ ఆర్‌టిఎ కార్యాలయంలో ఏమైన సమస్యలు ఉంటే పరిష్కారించుకోవాలని, కాని అధికారులపై దాడులు చేయడం సరికాదన్నారు. గతంలో కంటే ఆర్‌టిఎ కార్యాలయంలో ఏలాంటి సమస్యలు ఉన్న యూనియన్ నాయకులకు సముచితంగా గౌరవించి అధికారులు సానుకూలంగా స్పందిస్తున్నారని వారు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఆటో యూనియన్ నాయకులు చూసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు జి.శరత్ కుమార్, మహ్మద్ ఫరూఖ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

### - కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

**మూసాపేట్, జూన్ 28, ప్రభాతవార్త**
భూగర్భ డ్రైనేజీ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు నాలా వరకు సుమారు రెండు కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉషాముల్లపూడి ప్రధాన రహదరి సమీపంలో ఉన్న శుభోదయ కాలనీ వద్ద వర్షం వస్తే రోడ్డుపై నీరు నిలిచిపోయి, ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ఇబ్బందికరంగా ఉండేదని, ఈ పనులు పూర్తయితే పైప్‌లైన్ ద్వారా వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లి ఎల్లమ్మ చెరువు వద్ద నాలాలో కలిసిపోతాయని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీమున్నా, పోశెట్టిగౌడ్, మోజెస్, వర్క్ఇన్స్‌పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ లేని లిఫ్ట్ గుంత..

**పేట్ బషీరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త**
లిఫ్టు కోసం తీసిన గుంతనే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణదారులు క్యూరింగ్ (నిర్మాణానికి నీరు కొట్టేందుకు) సంపుగా వినియోగించడం గమనార్హం. లిఫ్ట్ గుంతలో సుమారు 5 అడుగుల మేరకు నీటిని నింపి దానిని సంపుగా వినియోగిస్తూ, దానిలో మోటర్‌ను ఏర్పాటు చేసి పైప్‌లైన్ ద్వారా నిర్మాణానికి క్యూరింగ్ చేస్తున్నారు. దాని కారణంగానే మేస్త్రి ఆ గుంతలో పడి మరణించాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లిఫ్టు గుంతకు అడ్డంగా ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం, కనీసం జాగ్రత్తలు పాటించకుండా ప్రమాదకరంగా ఉండడంతో సంఘటన చోటుచేసుకుంది. లిఫ్టు గుంత నిండా నీరు ఉండడం, మేస్త్రి మద్యం సేవించి అందులో పడిపోవడంతో మరణించాడని, లేకుంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని తోటి కార్మికుల అభిప్రాయం. ప్రమాదం జరిగిన అనంతరం లిఫ్టు గుంతకు పాత తలుపును అడ్డంగా ఏర్పాటు చేశారు. నిర్మాణదారులు వచ్చిన అనంతరం సుమారు 11 గంటలకు శవాన్ని పోస్టుమార్టం నిమితనతం గాంధీకి తరలించినట్లు సమాచారం. నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్ లిఫ్ట్ కోసం తీసిన గుంతలో ప్రమాదశాత్తు ఓ మేస్త్రి పడి మరణించిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్ర సమీపంలోని గ్రీన్ పార్క్‌లో గణేష్ బిల్డర్స్‌గ్రౌండ్ ప్లస్ 5 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని చేస్తున్నారు. నిర్మాణ పనుల్లోన్ల భాగంగా చత్తీస్‌ఘడ్‌కు చెందిన రామ (సుమారు 30ఏళ్లు) మేస్త్రి పని చేస్తున్నాడు. అయితే గతంలో అదే అపార్ట్‌మెంట్‌లో రెండు నెలలు మేస్త్రి పని చేసిన అతను ఇటీవల స్వగ్రామానికి వెళ్లి గురువారం మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. వచ్చినప్పటి నుంచి రాత్రి వరకు అతను మద్యం సేవిసూనతనే ఉన్నాడని ప్రత్యక్ష సాక్షులు తెలుపుతున్నారు. అయితే శుక్రవారం ఉదయం లిఫ్టు కోసం తీసిన గుంతలోని నీటిలో పడి శవమై వారికి కనిపించాడు. రాత్రి వరకు తమతోటే ఉన్నాడని, ఏ సమయంలో లిఫ్టు గుంతలో పడ్డాడో తెలియదని, ఉదయం 9 గంటల ప్రాంతంలో లిఫ్టుగుంత వద్దకు వెళ్తే శవమై కనిపించాడని వాచ్‌మెన్ తెలిపాడు.

## అబ్దుల్‌మియాకుంటలో ఆక్రమణలు తొలగించండి : ఆకుల సతీష్

**దుండిగల్, జూన్ 28 ప్రభాతవార్త:**
గండిమైసమ్మ–దుండిగల్ మండలం, శంభీపూర్ గ్రామ పరిధిలోని అబ్దుల్‌మియాకుంటలో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ భాజపా నాయకులు ఆకుల సతీష్ శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎండిఏ ప్రాథమిక నోటిఫికేషన్ 2019 ప్రకారం అబ్దుల్‌మియాకుంట చెరువు 2.53 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇటీవల కాలంలో చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ ఆక్రమించుకొని సిమెంట్ ప్రీకాస్ట్‌వాల్‌తో రెండు చోట్ల, కిర్బిషీట్‌తో మరోచోట భారీ షెడ్డు నిర్మాణం జరిగింది. ఫిర్యాదులు రావడంతో అధికారులు ఒక్కచోట మాత్రమే పాక్షిక కూల్చివేతలు చేపట్టి మిగితా నిర్మాణాలు వదిలివేయడంలో అంతర్యం ఏమిటో అన్నారు. బఫర్‌జోన్ ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు బిఆర్ఎస్ నాయకుని చెందినవి కావడంతోనే కుంటిసాకులు చెపుతూ వారికి సహకరిస్తూ చర్యలు చేపట్టడం లేదన్నారు. చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లోని ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించడంతో పాటు ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెరువు ఆక్రమణకు కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్ణారెడ్డి, అతీష్, సోనుమూదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద,మురుగునీటితో సతమతమవుతున్న ప్రజలు

**కంటోన్మెంట్,జూన్ 28 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసి కంటోన్మెంట్ బోర్డు సరిహద్దుల్లో ఉన్న నాలా నుంచి వరద, మురుగునీరు సాఫీగా పోయేందుకు శాశ్వత మరమ్మత్తులు చేపట్టక పోవడంతో వెస్ట్ మారేడ్‌పల్లి, ఎల్.శంకర్ నగర్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ఏసంవత్సరాల నుంచి వరద, మురుగునీటి నాలా పై ఓ వ్యక్తి బహుళ అంతస్థులు నిర్మించాడు. అదే విధంగా వరద, మురుగు నీరు సాఫీగా పోయేందుకు నాలాను కబ్జా చేసుకొని బహుళ అంతఃస్తులు నిర్మిస్తున్నాడు. ఆ వ్యక్తికి పదవీ విరమణ చేయబోతున్న ఇంజనీర్లు కొందరు సహకరించి భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈస్ట్,వెస్ట్ మారేడ్‌పల్లి గీతా నర్సింగ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఈ ప్రాంతాల నుంచి వెళ్ళాలి సఉంది. వరద, మురుగునీరు ఏసాఫీగా వెళ్లేందుకు దారి లేక పోవడంతో ఎల్.శంకర్ నగర్ బస్తీ నిరంతరం మురునీటితో జలమయం అవుతుంది. నాలాను కబ్జా చేసి బహుళ అంతస్థులు నిర్మిస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, ఆ భవనం పక్కన ఉన్న నాలాపై విచారణ చేపట్టాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికలు వేర్వేర్‌గా బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చారు. ఆక్రమణకు గురైన నాలాపై చర్యలు తీసుకుంటామని సిఈఓ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## ఆనందరావుకు వెంటనే పోస్టింగ్ ఇవ్వాలి

**-గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు, ఓయుజేఏసీ అధ్యక్షుడు శరత్‌నాయక్**

**చిక్కడపల్లి, జూన్ 28 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014ను అనుసరించి తెలంగాణకు కేటాయించిన అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆనందరావుకు వెంటనే పోస్టింగ్ ఇచ్చి న్యాయం చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు, ఓయుజేఏసీ అధ్యక్షుడు శరత్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. చట్టంనుంచి అనుసరించి రెండు రాష్ట్రాలలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల విభజన 2022లో జరిగిందని, 22 నెలలుగడుస్తున్నా ఆయనకు పదవి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, ఇదే విషయాన్ని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహాకు, వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలను ఇవ్వడం జరిగిందని, ఈ మేరకు ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ శివలీలను కలిసి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. జీవో 106ను అనుసరించి తక్షణమే ఆనందరావుకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచర ప్రకటిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో గిరిజన శక్తి వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బునాయక్, చీఫ్‌కోఆర్డినేటర్ రమేశ్ రాథోడ్, ఓయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు నాయక్, సతీష్‌నాయక్, సైఫాబాద్ కళాశాల అధ్యక్షుడు మౌలాల్ నాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కలవెండి శ్రీనివాసమూర్తి మృతి

**చిక్కడపల్లి, జూన్ 28 ప్రభాతవార్త:** కళాహృదయులు, ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ కలవెండి ఫౌండేషన్ అధినేత కలవెండి శ్రీనివాసమూర్తి(77) తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసమూర్తి తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు సునీల్, రాజ్ ఉన్నారు. దశాబ్దకాలంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసముంటున్న శ్రీనివాసమూర్తి తెలుగు భాష, సంస్కృతి పురోభివృద్ధికి తన ఫౌండేషన్ ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు శ్రీనివాసమూర్తి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపక సభ్యుడైన శ్రీనివాస్‌మూర్తి అంతర్జాతీయ సాంస్కృతిక సంఘం, ఫాస్ ఫిలిం సంస్థల ద్వారా అమెరికాలో అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మృతి పట్ల ఫాస్ అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు, సినీదర్శకులు రేలంగి నర్సింహారావు, సినీనిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ సంతాపం తెలిపారు.

**ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులు ఎమ్మెల్యే తనిఖీ**

**జీడిమెట్ల, జూన్ 28, ప్రభాతవార్త**
130 సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లో కొనసాగుతున్న ఇండోర్ స్టేడియం పనులను శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి కోసం గతంలో కేటాయించిన ఖాళీ స్థలాలలో ఇండోర్ స్టేడియం, పార్కుల అభివృద్ధి వంటి పనులను చేపట్టడం ద్వారా కాలనీ వాసులతో పాటు క్రీడాకారులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో చేపట్టవలసిన పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దూదిమెట్ల సోమేష్ యాదవ్, గుబ్బల లక్ష్మీనారాయణ, యూసుఫ్, ప్రభాకర్, శ్రీనివాస్‌రావు, మల్లికార్జునరావు, బాబి, పూర్ణచందర్ గుప్త, శేషచారి, భాస్కర్‌రెడ్డి, అనిల్, రమణ గణేశన్, రామకృష్ణ, దుర్గారావు, కిరణ్, రాజు, హరిబాబు, వర్మ, రామస్వామి, వేణు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల నాడి తెలుసుకుని సేవలందించిన ఘనత మంద శ్రీధర్‌రెడ్డిదే : వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, జూన్28 ప్రభాతవార్త**
ప్రజల నాడితెలుసుకుని ఉత్తమసేవలు అందించడంతో జలమండలి కుత్బుల్లాపూర్ జనరల్‌మేనేజర్, సిజిఎం మంద శ్రీధర్‌రెడ్డి తనదైన గుర్తింపు సాధించారని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. శ్రీధర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఐడిపిఎల్ కాలనీలోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సమావేశం జలమండలి డిజిఎం శాకం రాజేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జలమండలి సిజిఎంలు విజయరావు, కె.నాగేంద్ర, కె.కిరణ్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ స్వామి తదితరులతో కలిసి ఆయన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో జలమండలి కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు మేనేజర్లు రోహిణి, శివప్రసాద్, అనుష, రమ్య, రవి, పూజిత, ఝూన్సి, అమర్నాద్‌లతో పాటు ఆదర్శనగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు, టిఆర్ఎస్ నాయకులు ఏర్వ శంకరయ్య, కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ టి.లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బొగ్గు గనులను సింగరేణి కార్మిక యాజమాన్యానికి కేటాయించాలి : సిపిఎం**

**అడ్డగుట్ట,జూన్ 28 ప్రభాతవార్త:** బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని సిపిఎం సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఎం.అజయ్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం అడ్డగుట్ట ఎమ్మార్వో చౌరస్తా వద్ద బొగ్గు గనుల శాఖపై కేంద్రం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్‌కు నేరుగా బొగ్గు గనులను కెటాయించాలని, కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తుందని, సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటలో పోటీ పడాలని నిర్ణయించింది. బొగ్గు గనుల కోసం స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేట్ ఏసంసంస్థలకు అప్పగిస్తే సహించేది లేదన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ఏసంపదను బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిసస్తున్న బిజెపి విధానాలకు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.మల్లేశ్, ఎం.అజయ్ బాబు, ఏ.బాలయ్య, టీ.మహేందర్, ఎం.గోపాల్, కృపాకర్, ఫాతీమా, యాకమ్మ పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఆర్.ఎం.

**కంటోన్మెంట్,జూన్ 28 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రీజియన్ పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సలహాలు, సూచనలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య డయల్ యువర్ ఆర్.ఎం. కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్.ఎం.కుస్రోషాఖాన్ తెలిపారు. ప్రయాణికులు డయల్ యువర్ ఆర్.ఎం. నెం 9959900808, కంటోన్మెంట్ డిపో 9959226143, హెచ్‌సీయు 9959226132, జీడిమెట్ల 9959226150, మేడ్చెల్ 9959226152, మియాపూర్ 9959226420, చెంగిచెర్ల 7893088433 ,హకీంపేట్ 9959226144, కుషాయిగూడ 9959226145, ఉప్పల్ 9959226140 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.




టి20 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఇండియా టీమ్ విజయం సాధించాలని కోరుతూ పాతబస్తీ మదీనా సర్కిల్ మహ్మద్ క్యాప్ మార్ట్ వద్ద ఇండియా క్రికెట్ టీమ్ ఆటగాళ్ల ఫోటోలను షోకేస్‌లో పెట్టి ప్రదర్శించిన చిత్రం

## డాక్టర్ సృజనకు సేవా యూత్ సన్మానం



డా.సృజనను సన్మానిస్తున్న రచ్చ శ్రీనివాస్, చందర్‌పాల్, నిఖిల్ తదితరులు

**హైదరాబాద్,జూన్ 28,ప్రభాతవార్త:**
మధుమేహ వ్యాధి నిపుణురాలు డాక్టర్ సృజనను సేవ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురువు చందర్‌పాల్ బాబా దంపతులు, నిఖిల్ తదితరలతో కలిసి పులబొక్కే అందజేసి శాలువాతో సత్కరించారు. నగరంలోని పలుచోట్ల హెల్త్‌క్యాంపులను నిర్వహించి పేదలకు ఉచితంగా సేవ చేస్తున్నందుకు ఆమెను సన్మానం చేసినట్లు వారు తెలిపారు.

## బహుభాషా కోవిదుడు భారతరత్న పి.వి

**నాంపల్లి, జూన్ 28 ప్రభాతవార్త :** భారతదేశ మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, భారతరత్న పి.వి.నరసింహారావు జయంతిని పురస్కరించుకొని తెలుగుభాషా చైతన్య సమితి, శ్రీధర్ ప్లాజా సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ సమావేశం ఘనంగా నిర్వహించారు. సి.రామకృష్ణ చంద్రమౌళి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుభాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి.బడేసాబ్, వి.రామమూర్తి, సిఎన్.రావు, గిరిజారాణి, ఆర్.ప్రకాష్, కొండయ్య తదితరులు పాల్గొని ప్రసంగిస్తూ దేశ అతిక్లిష్ట పరిస్థితుల్లో అద్భుత సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలకు నాందిపలికి ప్రపంచంలో భారతదేశాన్ని సర్వతోముఖాభివృద్ధిలో తీసుకువెళ్లడానికి అశేషకృషి చేసిన పి.వి దక్షిణ భారతదేశం నుండవ తెలుగువాడు కావడం ఎంతో గర్వకారణమన్నారు. మన రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రిగా చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. కేంద్ర రాజకీయాల్లో చక్రంతి ప్పిన పి.వి తెలంగాణ వాడు కావడం జాతి గొప్పదనం, అదృష్టమన్నారు.

## హాస్యానికే ఐకాన్ ముళ్లపూడి వెంకటరమణ

**న-సమైక్య ఏపి విశ్రాంత ముఖ్యకార్యదర్శి మోహన్‌కందా**

**రవీంద్రభారతి, జూన్ 28 ప్రభాతవార్త :** హాస్యానికే ఐకాన్ వంటివాడు ముళ్లపూడి వెంకటరమణ అని, ఆయన జయంతిని పురస్కరించుకొని సమవుజ్జీ అయిన ప్రముఖ రచయిత ఎమ్బీఎస్ ప్రసాద్‌కు ముళ్లపూడి వెంకటరమణ స్మారక పురస్కారం ప్రదానం చేయడంతో ఎంతో సబబుగా ఉందని అభినందించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శోభా ఇంటర్నేషనల్ అకాడమీ నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఎస్వీ రామారావు సభాధ్యక్షతన ప్రముఖ రచయిత ముళ్లపూడి వెంకటరమణ 94వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. మోహన్‌కందా విశిష్ట అతిథులు డా. మామిడి హరికృష్ణ, లంక లక్ష్మీనారాయణ, యాట సత్యనారాయణ, సంస్థ అధ్యక్షురాలు, ప్రముఖ గాయని శోభారాణి, ప్రముఖ రచయిత్రి ముళ్లపూడి శ్రీదేవి తదితరులతో కలిసి ప్రముఖ రచయిత ఎమ్బీఎస్ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి ముళ్లపూడి వెంకటరమణ స్మారక పురస్కారం ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. సభకుముందు సాంస్కృతిక కార్యక్రమంలో వర్ధమాన గాయకులచే ముళ్లపూడి వెంకటరమణ చిత్రగీతమాలిక ఆహుతులకు వీనులవిందు కావించింది.

## నల్లకుంటలో పివి నరసింహారావు జయంతి



పీ.వీ.నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు 103 జయంతి వేడుకలు నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నల్లకుంటలో జరిగిన ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల ఆద్యుడు, బహుభాషా కోవిదుడు, తొలి తెలుగు ప్రధాని, భారత రత్న పి.వి.నరసింహారావు స్ఫూర్తితో ముందుకు సాగుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.సుబ్రహ్మణ్యం, శరత్‌ముదిరాజ్, ధనార్జున్‌రెడ్డి, ఏ.నరేందర్‌రెడ్డి, మధు, మురళి, జగన్, విశ్వేశ్వర్, శ్రవణ్, సంజయ్ పాల్గొన్నారు.

**అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు**

**బేగంపేట జూన్ 28,ప్రభాతవార్త**
బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై బేగంపేట పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసారు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ప్రాంతానికి చెందిన బాలిక (12) స్థానికంగా ఉండే పాఠశాలలో విద్యనభ్యసిస్తుంది. గురువారం మధ్యాహ్నం బాలిక సమీపంలో నివసించే తమ బంధువుల ఇంటికి ఆడుకునేందుకు వెళ్లింది.ఈ సమయంలో సమీప బంధువైన యువకుడు (18) బాలికను బలవంతం చేసి అసభ్యంగా ప్రవర్తించాడు.అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఘటనను వీడియో తీసాడు.దీంతో భయంతో వణికిపోయిన బాలిక కేకలు వేస్తూ ఇంటికి పరుగు తీసింది.విషయం తెల్సుకున్న బాలిక సోదరుడు నిందితుడి వద్దకు వెళ్లి అతని ఫోన్ తీసుకుని వీడియో తీసిన అసభ్యకరమైన చేష్టలను చూసాడు.ఆ తరువాత ఇదే విషయాన్ని తల్లికి చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేసారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసారు.

## దొంగతనానికి యత్నించిన మహిళ అరెస్టు

**యూసుఫ్‌గూడ, జూన్ 28, ప్రభాతవార్త :**
బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టపగలే ఓ మహిళ దొంగతనానికి యత్నించింది. బోరబండ సైట్ 3లోని వీకర్ సెక్షన్ గృహాలలో ఓ మహిళ ఇంట్లో చొరబడి దొంగతనం చేస్తుండగా ఇంటి యజమాని అది గమనించి చాకచక్యంగా ఇంటికి బయట నుంచి గొల్లం పెట్టి వందకు డయల్ చేశారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడికక్కడే చేరుకుని మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

**కారు ఢీకొనడంతో పారిశుధ్య కార్మికుడికి తీవ్రగాయాలు**

**జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు**

**కుత్బుల్లాపూర్, జూన్ 28 ప్రభాతవార్త :** అతివేగంతో అదుపుతప్పిన కారువిధినిర్వాహణలో ఉన్న పారిశుద్ద కార్మికుడిని వేగంగా ఢీకొనడంతో తీవ్రగాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని ఐడిపిఎల్ చౌరస్తా నుండి చింతల్ వెళ్లేదారిలో పారిశుద్ద కార్మికుడు బి.నాగాంజనేయ శాంతారావు విధులు నిర్వహిస్తున్నాడు. ఇదేసమయంలో అతివేగంగా వచ్చిన ఉబర్ కారు అదుపుతప్పి విధులు నిర్వహిస్తున్న కార్మికుడు బి. నాగాంజనేయ శాంతారావును ఢీకొట్టింది. దీనితో ఒక్కసారిగా కారుఢీకొట్టిన వేగానికి ఎగిరి విద్యుత్ స్థంబానికి ఢీకొని క్రిందపడ్డాడు. ఇదిగమనించిన స్థానికులు హుటాహుటిన అతడికి ప్రారథమిక చికిత్స అందించి ఎఇస్ఐ ఆసుపత్రికి చికిత్సనిమిత్తం తరలించారు.కాళ్లకు తీవ్రగాయాలు కావడంతోపాటు ఆరోగ్యపరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. సానికుల సమాచారంలో జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ఉబర్ క్యాబ్‌డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలి: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ఉన్నారు

**సరూర్‌నగర్, జూన్ 28 ప్రభాతవార్త:** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు గత ఎన్నికల్లో అధికారంలోకి వస్తే అదనంగా తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీమంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో శుక్రవారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారునికి తులం బంగారం కచ్చితంగా ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. గత ఎన్నికల కంటే ముందు అప్పటి సిఎం కెసిఆర్ మహేశ్వరం నియోజకవర్గంలో మౌళిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేశారనీ అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సదరు నిధులను ర్దు చేసిందని ఆమె వెల్లడించారు. అయితే అభివృద్ధిని అడ్డుకోకుండా గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 250 కోట్లకు కలిసి అదనంగా రూ.250 కోట్లు నియోజకవర్గానికి కేటాయించాలని ఆమె సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నిధుల విషయంలో తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార ్యక్రమాల్లో బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, జల్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భరత్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని పాత భరత్‌నగర్‌లో చేపడుతున్న సిసి రోడ్డు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజితరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వసంత, స్థానిక నేతలు గొరిగె కృష్ణ, ఈగ అంజయ్య, ఈగ లక్ష్మణ్, ఈగ సంతోష్, ఈగ శ్రీనివాస్, శంకర్, మురళీ, సల్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, హరి, బాబు, జితేందర్‌రెడ్డి, నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల హృదయాల్లో మాజీ ప్రధాని పివి చిరస్మరణీయుడు: మిద్దెల జితేందర్



పివి నర్సింహారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మిద్దెల జితేందర్

**సైదాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** తెలుగుప్రజల హృదయాల్లో మాజీ ప్రధానమంత్రి దివంగత పివి నర్సింహారావు చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. పివి నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి సుస్థిరం చేసిన ఘనత పివికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సద్గుణరావు, మధు, మురళీధర్, అష్రఫ్ అలీ, ప్రకాష్, మనోజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**పివికి ఘన నివాళులు...** మాజీ ప్రధాన మంత్రి దివంగత పివి నర్సింహారావు జయంతి సందర్భంగా శాసనసభలోని ఆయన చిత్ర పటానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, జిహెచ్‌ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ప్రపంచంలో గుండె జబ్బులతోనే ఎక్కువ మరణాలు : డాక్టర్ బాలరాజు నాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ బాలరాజు నాయుడు

**సైదాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** ప్రపంచంలో ఎక్కువ మరణాలు గుండె జబ్బుల వల్లే సంభవిస్తున్నాయని ఒనస్ ఆసుపత్రి ఎండి డాక్టర్ బాలరాజు నాయుడు, కార్డియాలజి విభాగం హెడ్ డాక్టర్ లక్కిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ పి.రవి కిరణ్‌లు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఊబకాయం, స్మోకింగ్, మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లు వంటి వల్ల గుండె జబ్బుల ముప్పు రోజురోజుకు పెరుగుతుందన్నారు. ఒనస్ ఆసుపత్రిలో హార్ట్ ఏఐ పేరిట హార్ట్ ఇన్స్టిట్యూట్‌ను ప్రారంభిస్తునట్లు వారు తెలిపారు. కార్డియాలజిలో అడ్వాన్స్‌డ్ ఇమేజ్ విత్ ఏఐ 36 శాతం ఎక్కువ ఫలితాలు ఇస్తుందన్నారు. అత్యాధునిక సదుపాయాలతో హై ఎండ్ క్యాత్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నేడు వయస్సుతో సంబంధం లేకుండా చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి రోజు తప్పని సరిగా కనీసం అరగంట పాటు నడక ఉండాలని, వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు.

## గ్రేటర్ కమిషనర్ అమ్రపాలితో ఎమ్మెల్యే బేటి



జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి కలిసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంసి నూతన కమిషనర్‌గా నియమితులైన కె.అమ్రపాలిని శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా బేటి అయ్యారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితోపాటు, కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ , ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతిసాయిజెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేతలు గంధం నాగేశ్వర్ రావు, బన్నాల ప్రవీణ్, ఆకుల మహేందర్, బైరి నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్, జెట్ట కిషోర్, సుక్క కిరణ్, నిరంజన్‌చారి, సోమిరెడ్డి, రాంరెడ్డి, కాలేరు నవీన్ తదితరులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి తగు చేయూత అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులు చేపట్టేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెటిసి రమేష్‌పై దాడికి నిరసనగా ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు



జెటిసి రమేష్‌పై దాడికి నిరసనగా ఉప్పల్ ఆర్‌టిఒ కార్యాలయంలో ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** ఖైరతాబాద్ ఆర్‌టిఒ కార్యాలయంలో పనిచేస్తున్న జెటిసి రమేష్‌పై ఆటో యూనియన్ నేత ఆమానుల్లాఖాన్ దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉప్పల్‌లోని రవాణాశాఖ ఉద్యోగులు, ఇతర సిబ్బంది విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రవాణాశాఖ ఉద్యోగులపై దాడులు సబబు కాదని, ఉద్యోగులపై దాడులు చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రకటించారు. ఈ సందర్భంగా వివిధ పనుల కోసం వచ్చిన వాహనదారులు ఆందోళన విషయం తెలియక ఇబ్బందిపడ్డారు. స్లాట్‌లు బుక్ చేసుకుని వచ్చిన వారికి మధ్యాహ్నం తర్వాత కొంత మందిని పనులు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## టికెఆర్ ఉమెన్స్ టి20 విజేతలకు ట్రోఫీల ప్రదానం



ట్రోఫీని అందజేస్తున్న తీగల కృష్ణారెడ్డి, పారిజాత

**సరూర్‌నగర్, జూన్ 28 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ కాలేజీ క్యాంపస్‌లో శుక్రవారం టికెఆర్ టి 20 ఉమెన్స్ క్రికెట్ పోటీల ముగింపు సందర్భంగా విజేత జట్లకు ట్రోఫీల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిలు గెలుపొందిన జట్లకు ట్రోఫీలను, మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో పివి జయంతి



పివికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 28 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శుక్రవారం మాజీ ప్రధాని భారత రత్న స్వర్గీయ పివి నర్సింహారావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు మంగు రాఘవరావు తదితరులు పివి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ కొటార్, చక్రవర్తుల మదనమోహనాచార్యులు, నందూరి ప్రకాష్, మంత్రాల శ్రీరామమూర్తి, రంగరాజు యాదగిరిరావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రామంతాపూర్ ఎఇ రాములు తెలిపారు. రామంతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని చర్చి కాలనీ పరిధిలో నెహ్రూనగర్, ఇందిరానగర్, ప్రగతినగర్, సత్యనారాయణ స్వామి దేవాలయం, పారిజాత స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అదే విధంగా 11 కెవి శ్రీనివాసపురం పరిధిలోని శ్రీనివాసపురం, యాదయ్య హోటల్, వెంకటరెడ్డినగర్, కామాక్షిపురం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని ఎఇ రాములు తెలిపారు. అదే విధంగా హబ్సిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీ ఫీడర్ పరిధిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీ, వసంత విహార్ కాలనీ, వివినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటలనుంచి 12వరకు, 11 కెవి ఐఎస్ఐ ఫీడర్ పరిధిలోని జెఎస్‌ఎన్‌కాలనీ, జిజి కాలనీ, వివినగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు, రవీంద్రనగర్ పరిధిలోని జెఎస్‌ఎన్‌కాలనీ, మహేశ్వరినగర్, ఎస్‌ఎస్‌నగర్, రవీంద్రనగర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని ఎఇ రాంరెడ్డి తెలిపారు. అదే విధంగా నాచారం పరిధిలోని కార్తికేయనగర్ ఫీడర్ పరిధిలోని కార్తికేయనగర్, వీరారెడ్డినగర్, నాచారం ప్రధాన రహదారిలో ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ బి.నాగరాజు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బలాల



మూసారాంబాగ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, జూన్ 28 ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే బలాల పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవింగా సిసి రోడ్డు నిర్మాణ పనులు, బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మలక్‌పేట నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులకు నిధులు ఇవ్వాలని వినతి : కార్పొరేటర్ కక్కిరేణి చేతన



జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ కక్కిరేణి చేతన తదితరులు

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు ఇవ్వాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన శుక్రవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌ను కలిసి విన్నవించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో నాలా రీమాడలింగ్ పనులు, రెయిన్ వాటర్ ప్రధాన సమస్యగా ఉందని వీటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మధురానగర్ పార్కు, సుందరీకరణ చేపట్టాలని, ఓపెన్ జిమ్స్, ఐలాలో సిఆర్‌ఎంపి పనులు పూర్తి చేయాలని సూచించారు. రవీంద్రనగర్‌లో యుజిడి సమస్య ఉందని, రవీంద్రనగర్ పార్కులో ఆట వస్తువులు రిపేరు చేయాలని సూచించారు. డివిజన్‌లోని పెండింగ్ సమస్యలు త్వరగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి నేతలు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్‌లు

**సరూర్‌నగర్, జూన్ 28 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ నుండి నాదర్‌గుల్‌కు వెళ్లే ప్రధాన రహదారి అసంపూర్తి పనులను పూర్తి చేయించాలని కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి కమీషనర్ రఘును కోరారు. ఈ మేరకు శుక్రవారం నాదర్‌గుల్ బిజెపి నాయకుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్‌కు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎండిఎ నుండి నిధులు మంజూరైన టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని పనులు ప్రారంభమైనా సదరు కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు వదిలేశారని కమీషనర్ దృష్టికి తెచ్చారు. దీంతో వర్షాకాలం ప్రారంభమైనందున ఈ రహదారిలో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికను రోడ్డు నిర్మాణపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## జులై 6 నుంచి వారాహీ దేవి నవరాత్రులు

**ఎల్.బి.నగర్, జూన్ 28 ప్రభాతవార్త:** ఆర్కేపురంలోని కుర్తాలపీఠం వారాహి సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయములో శ్రీవారాహిదేవి నవరాత్రులు జులై 6నుండి 14తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయం సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. నవరాత్రులకు సంబంధించిన ఆహ్వాన పత్రికను మంగళవారం భక్తుల సమక్షంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రులలో ప్రతిరోజు ఉదయం విశేష అభిషేకాలు, మహిళలతో, కుంకుమార్చన, సాయంత్రం లలిత పారాయణం, విష్ణు, సౌందర్యలహరి, హనుమాన్ చాలీసా పారాయణాలు జరుగుతాయని తెలిపారు. మహానక్షత్ర హారతులు, లక్ష బిల్వార్చన, లక్ష పుష్పార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## చెత్త సేకరణపై వీధులలో అవగాహన ర్యాలీ



చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉప్పల్ పారిశుధ్య విభాగం అధికారులు, ఇతర సిబ్బంది దృశ్యం.

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు డిసి అంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ భరత్‌నగర్, బీరప్పగడ్డలో చెత్త ఆటోలకు చెత్త ఇవ్వని ఇళ్ల యజమానుల ఇంటి ముందు ప్లకార్డులలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శానిటేషన్ డిఇ చందన, సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రెడ్డి, రాంకీ సూపర్‌వైజర్లు నవీన, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చెత్త సేకరణ పై ఇంటికి తిరిగి సర్వే చేపట్టినట్లు తెలిపారు. చెత్త ఆటో రిక్షాలకు చెత్త ఇవ్వని వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉప్పల్ భరత్‌నగర్ లో ఒకే ఇంట్లో ఉన్న 32 కుటుంబాలకు చెందిన వ్యక్తులు చెత్త ఇవ్వడం లేదని, రోడ్లపై వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేసే వారికి జరిమానా విధిస్తామని తెలిపారు. ఉప్పల్ సర్కిల్‌ను చెత్త రహిత సర్కిల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.14లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ ధర్మపురికాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, జూన్ 28 ప్రభాతవార్త :** ఉప్పల్ ధర్మపురికాలనీలో రూ.14లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ధర్మపురికాలనీలో పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నెంబర్ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ధర్మపురికాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** పారిశుధ్య పరిరక్షణలో కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వాములుకావాలని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కాకతీయ కాలనీలో చెత్తను తొలగించడానికి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్త రిక్షాను కార్పొరేటర్ చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పారిశుధ్యాన్ని కాపాడడంలో జిహెచ్‌ఎంసి కార్మికుల పాత్ర చాలా గొప్పదని అన్నారు. కాలనీలలో పారిశుధ్యాన్ని కాపాడడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా గుర్తించాల న్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు అమిఉద్దీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలి: స్వప్న



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న

**హయత్‌నగర్, జూన్ 28 ప్రభాతవార్త:** వర్షాకాలం ఆరంభం అయిన నేపథ్యంలో పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలని... దోమలు వృద్ధిచెందకుండా చూడాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవులస్వప్న అన్నారు. తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో అజెండాలోని మొత్తం 46 అంశాలపై చర్చించిన సభ్యులు 44 అంశాలను ఆమోదించారు. 2 అదనపు అంశాలను సైతం ఆమోదించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ... మున్సిపాలిటి పరిధిలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. సభ్యులు ఆయా వార్డులలో సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని పీవీకి నాయకుల ఘన నివాళి



పిసి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, జూన్ 28 ప్రభాతవార్త :** భారత మాజీ ప్రధానమంత్రి భారతరత్న పీవీ నరసింహారావు 103వ జయంతి సందర్భంగా ఓల్డ్ మలక్‌పేట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పివి జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు పివీ ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన గొప్ప వ్యక్తి అని, భూసంస్కరణలు సైతం అమలు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పటేల్ కాంగ్రెస్ నాయకులు పాశం రాజేందర్ యాదవ్ నర్సింగరావు ప్రభాకర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు సర్కార్ ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఎమ్మెల్యే మర్రి

**మల్కాజిగిరి, జూన్ 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాలు ఉత్సవాలు మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో మల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ప్రైవేటు దేవాలయాలకు ఆర్థిక సాయం కోసం వారం రోజుల్లో ఆలయ కమిటీలు రెండు జతల దరఖాస్తులను (ఆలయ లెటర్ హెడ్‌పై దరఖాస్తు, ఆలయ ఫోటోలు, బ్యాంకు వివరాలు, ఆలయ నిర్వాహకుడి ఆధార్‌కార్డ్, మొబైల్ నెంబర్, గత సంవత్సర చెక్కు కాపీ సమర్పించాలి. మరిన్ని వివరాలకు 9154959927, 9133999507 నంబర్లను సంప్రదించండి) పైన తెలిపిన అన్ని డాక్యుమెంట్లను బోయిన్‌పల్లి సౌజన్య కాలనీలోని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెండు జతలు అందజేయాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు.